నేడు కన్హా శాంతివనానికి కేంద్రమంత్రి

- యూత్ ఆగ్రో సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొననున్న మన్‌సుఖ్ మాండవీయా

నందిగామ, సెప్టెంబరు 19: నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతి వనంలో శుక్రవారం జరగనున్న యూత్ ఆగ్రో సమ్మిట్ కార్యక్రమానికి కేంద్ర యువజన, క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా హాజరుకానున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రమిషన్ ప్రెసిడెంట్ గురూజీ కమలేష్ పటేల్ పాల్గొననున్నారు.


ఆమనగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

జిల్లావ్యాప్తంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను గురువారం అట్టహాసంగా జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకొని మజీద్‌లను శోభాయమానంగా అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల్లో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మజీద్ కమిటీల ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

- ఆమనగల్లు

విద్యార్థుల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తాం


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంక టయ్య అన్నారు. శంషాబాద్ మండల పరిధిలోని పాల్మాకుల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని గురువారం రాత్రి ఆయన సందర్శించారు. ఇటీవల ఉపాధ్యాయులు వేధిస్తున్నారని, పురుగుల అన్నం పెడుతున్నారని హైదరాబాద్-బెంగళూర్ జాతీయ రహదారిపై విద్యార్థులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత మాజీ మంత్రులు హరీష్‌రావు, సబితారెడ్డి విద్యా ర్థులను పరామర్శించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈమేరకు పాఠశాలకు వెళ్లిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భోజనశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, రాష్ట్ర కార్యదర్శి కల్పన, నవీన్ తదితరులు ఉన్నారు.

వేర్వేరు విమానాల్లో అస్వస్థతకు గురై ఇద్దరి మృతి

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 19 : రెండు వేర్వేరు విమానాల్లో ప్రయాణించిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆర్‌జీఐ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని బోయిన్‌పల్లికి చెందిన నితీశ్(40) ఈ నెల 16 తేదీ రాత్రి 7.30 గంటలకు గోవా నుంచి ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు వస్తుండగా విమానంలో మార్గ మధ్యలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ప్రథమ చికిత్స నిర్వహించి విమానం ల్యాండ్ కాగానే వెంటనే ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అలాగే 17వ తేదీ తెల్లవారుజామున నగరంలోని పాత బస్తీకి చెందిన షేక్ సకీనా (70) మక్కా వెళ్లి తిరిగి వస్తుండగా విమానంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విమానం ల్యాండ్ కాగానే కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు సకీనా మృతి చెందాడు. అయితే వీరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వనందున ఎలాంటి కేసులు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

భూ నిర్వాసితులకు త్వరలో పరిహారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల, సెప్టెంబరు 19: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ-82 కాల్వ నిర్మాణానికి భూములు ఇచ్చిన నిర్వాసిత రైతులకు దసరా లోపు పరిహారం అందిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం సింగంపల్లిలో గురువారం పర్యటించారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ ఎస్ఏ న్‌రెడ్డి, ఈఈ శ్రీకాంత్, డీఈఈ దేవానంద్, పీఎం వెంకట్రావ్, ఏఈ రాఘవేందర్‌రెడ్డి, రైతులతో కలిసి కేఎల్ఐ డీ-82 కాల్వ అసంపూర్తి పనులు పరిశీలించారు. పనుల విషయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనతపై ఎమ్మెల్యే మండిపడ్డారు. పనులకు అడ్డుగా ఉన్న మిషన్ భగీరథ పైపులైన్‌ను వెంటనే మార్చాలన్నారు. ట్రిపుల్‌ఆర్ తమ భూముల మీదుగా పోకుండా చూడాలని సింగంపల్లి రైతులు ఎమ్మెల్యేను కోరగా.. సీఎం దృష్టికి తీసుకుపోతానని చెప్పారు. కాల్వ పనులు పూర్తిచేసి 15 రోజుల్లో రైతులకు సాగునీరందిస్తామని చెప్పారు. నిర్వాసిత రైతులకు ప్రభుత్వం రూ.15 కోట్లు విడుదల చేస్తుందన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, మాజీ సర్పంచ్ ప్రేమలతా నర్సింహ, పోలేపల్లి మాజీ ఉపసర్పంచ్ అంజన్ రెడ్డి, రాంబాబు, చంద్రశేఖర్, యాదయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పొలంలో క్షుద్ర పూజలు.. పోలీసుల విచారణ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చేవెళ్ల, సెప్టెంబరు 19 : గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతారంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన ఆవుల అనంతయ్య పంట పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం పౌర్ణమి సందర్భంగా అర్ధరాత్రి చామంతి తోటలో పసుపు, కుంకుమ కలిపిన అన్నం, పిండితో తయారుచేసిన ఓ బొమ్మ, దానికి రెండు చిన్న కట్టెపుల్లలు గుచ్చి ఓ ప్లాస్టిక్ ప్లేట్ ఉంచి క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించాయి. అదేవిధంగా పంట చేనులో మొక్కలను అక్కడక్కడ పీకేశారు. గురువారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు అనంతయ్య అదంతా చూసి పోలీస్‌లకు సమాచారం అందించాడు. వారు పొలం వద్దకు వెళ్లి చూసి క్షుద్రపూజలకు సంబంధించిన వస్తువులు దూరంగా పారబోశారు. ఇలాంటివి నమ్మొద్దని సూచించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని పోలీసులకు రైతు ఫిర్యాదు చేశాడు.

శిఖం భూమిలో నిర్మాణాలు చేపట్టొద్దు


శిఖం భూమిని పరిశీలిస్తున్న అధికారులు

చౌదరిగూడ, సెప్టెంబరు 19: చెరువులు, శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని షాద్‌నగర్ ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ సత్యప్రకాశ్ అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఎర్ర చెరువు పరిసరాలను ఏఈ సిం ధుతో కలిసి పరిశీలించారు. జిల్లేడ్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 145లో ఉన్న ఎర్రం చెరువులో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో కొందరు మట్టి పోసి నిర్మాణాలు చేపడుతున్నట్లు సమాచారం మేరకు చెరువును సందర్శించారు. చెరువు భూమిపై కోర్టులో కేసు నడుస్తోందని, అప్పటివరకు ఎలాంటి క్రయవిక్రయాలు, నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సత్యప్రకాశ్ అధికారులకు సూచించారు. ఈ వివాదంపై తాము కూడా హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఎర్రం చెరువులో క్రయ విక్రయాలు జరగకుండా నిలుపుదల చేయాలని స్థానిక తహసీల్దార్ జగదీశ్వర్‌కు సూచించారు.



పైకి రాని గంగమ్మ!

వరుణుడు కరుణించినా.. వానచుక్క భూమిలోకి ఇంకే పరిస్థితి కనిపించడం లేదు. భారీ వర్షాలు కురిసినా సాగు, తాగునీటికి తిప్పలు తప్పడం లేవు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించేందుకు అవసరమైన రీఛార్జి ఫిట్స్ తగినన్ని లేకపోవడంతో భూగర్భ జల మట్టాలు ఆశించినంతగా పెరగడం లేవని భూగర్భ జల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసినప్పుడు రోడ్లు మునుగుతున్నాయి, వరద నీరంతా వృథాగా మురుగునీటి కాల్వల్లో కలిసిపోతోంది. వాన నీటిని ఒడిసి పట్టుకోవడంలో విఫలమవుతున్నారు. ఫలితంగా వేసవిలో నీటి ఇక్కట్లు తప్పడం లేవు.

సమృద్ధిగా వర్షాలు కురిసినా పెరగని భూగర్భ జలాలు

- ఇంకా అట్టడుగు స్థాయిలోనే..
- ఆరు మండలాల్లో ప్రమాద ఘంటికలు
- ఇంకుడు గుంతలు లేక వర్షపు నీరు వృథా
- వాన నీటిని ఒడిసి పట్టుకోవడంలో విఫలం
- తాగు, సాగునీటి కోసం అల్లాడుతున్న జనం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 19 : జిల్లాలో ప్రతియేటా తాగు, సాగు నీటి సమస్య తీవ్రంగా మారుతోంది. వర్షాలు సరిగా కురవకపోవడంతో ఈ సమస్య ఎక్కువగా వస్తోంది. అయితే, ఈ యేడాది సాధారణానికి మించి వర్షం కురిసినా భూగర్భజలాలు పెరగలేదు. దీనికి కారణం వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోకపోవడమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు జిల్లాలో సాగునీటి కోసం అంతా బోర్లపైనే ఆధారపడాల్సి వచ్చింది. దీంతో భూగర్భంలో నుంచి ఎడా పెడా నీటిని తోడేస్తున్నారు. వాననీటిని అంతగా భూగర్భంలోకి ఇంకేలా చేయలేకపోతున్నారు. ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు తవ్వి వర్షపు నీటిని నిల్వ చేయాల్సి ఉన్నా.. ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఇంకుడు గుంతలు లేనిదే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్న నిబంధనను కఠినంగా అమలు చేయడం లేదు. దీంతో వర్షపు నీరంతా వృథాగా పోతుంది.


ఇంకుడు గుంతల్లో 'ఇంకి'న నిర్లక్ష్యం..!

గత ప్రభుత్వం చేపట్టిన ఇంకుడు గుంతల కార్యక్రమ లక్ష్యం నీరుగారి పోయింది. అధికారులు నిరక్ష్యం కారణంగా ఈ పథకం అమలులో నీలినీడలు కమ్ముకున్నాయి. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్న వారికి బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యం చేయడంతో వీటిని నిర్మించుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. 2023 లో జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో 2,790 ఇంకుడు గుంతలు తవ్వాలని

మిగతా 8వ పేజీలో...

భూగర్భ జలాల నీటిమట్టం (లోతు మీటర్లలో..)

మండలం	జూన్ 2023	జూన్ 2024	వ్యత్యాసం	జూలై 2023	జూలై 2024	వ్యత్యాసం	ఆగస్టు 2023	ఆగస్టు 2024	వ్యత్యాసం
చౌదరిగూడెం	13.41	15.66	-2.25	9.82	14.99	-5.17	7.15	16.25	-9.09
సరూర్‌నగర్	10.55	20.23	-9.68	8.26	20.51	-12.3	6.96	16.09	-9.13
మంచాల	7.74	12.74	-5.00	7.48	14.19	-6.71	7.19	15.08	-7.89
కొత్తూరు	9.65	14.02	-4.37	8.83	13.89	-5.06	7.10	13.98	-6.88
షాబాద్	11.91	13.97	-2.07	5.33	13.60	-8.28	6.70	13.49	-6.79
ఇబ్రహీంపట్నం	11.79	20.43	-8.64	12.52	17.53	-5.01	12.05	18.59	-6.54
మహేశ్వరం	10.68	13.96	-3.28	9.45	13.97	-4.53	7.96	13.70	-5.74
చేవెళ్ల	12.63	13.92	-1.29	12.84	13.81	-0.97	6.70	12.32	-5.63
శంషాబాద్	11.53	12.76	-1.24	8.75	12.24	-3.49	6.88	12.20	-5.32
మొయినాబాద్	10.26	12.35	-2.09	10.07	12.30	-2.23	6.84	12.12	-5.28




సమయానుకూలంగా బస్సులు నడపాలి

ఆర్టీసీ బస్ డిపో ఎదుట విద్యార్థుల ఆందోళన

షాద్‌నగర్, సెప్టెంబరు19: గ్రామీణ ప్రాంతాల నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపో ఎదురుగా వెయ్యి మంది విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల రాకపోకల సమయాన్ని కుదించారని తెలిపారు. ఉదయం వేళ బస్సులను నడపకపోవడం వల్ల పట్టణాలు, మండల కేంద్రాల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి పాఠశాలలకు చేరుకోలేక పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై షాద్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు అనేక వినతి పత్రాలు అందజేసిన పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పాఠశాలల వేళలకు అనుగుణంగా బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్మారెడ్డి, అమీర్, సిద్ధు, స్వాతి పాల్గొన్నారు.


బస్‌డిపో ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు


విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు



రాజీమార్గమే రాజమార్గం

కేశంపేట, సెప్టెంబరు 19: రాజీమార్గమే రాజమార్గమని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. చిన్న చిన్న తగాదాలు, చీటింగ్, దొంగతనం కేసులకు సంబంధించి జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ పడవచ్చని తెలిపారు. ఈ నెల 18 నుంచి 28వరకు షాద్‌నగర్ కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్లేనని, పెద్దల సమక్షంలో రాజీపడితే భవిష్యత్‌లో గొడవలు జరిగే అవకాశాలు ఉండవని ఆయన తెలిపారు.

























అంగన్‌వాడీ భవనానికి స్లాబ్



తాటిపర్తి అంగన్‌వాడీ భవనానికి స్లాబ్ వేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, సెప్టెంబరు 19 : మండల పరిధిలోని తాటిపర్తిలో ఉన్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరిన విషయమై ఇటీవల శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్పందించారు. రూ.లక్షతో భవనానికి కొత్తగా స్లాబ్ వేయించారు. గోడలు బాగానే ఉండడంతో పెయింట్ వేస్తే సరిపోతుందని వెల్లడించారు. నెల రోజుల్లో భవనాన్ని వినియోగంలోకి తెస్తామని అధికారులు చెప్పారు. కాగా, తమ ఇబ్బందిని అధికారుల దృష్టికి తెచ్చి సమస్య పరిష్కరించినందుకు గ్రామస్తులు 'ఆంధ్రజ్యోతి'కి ధన్యవాదాలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్‌తో ఆర్థిక చేయూత



చెక్కు అందిస్తున్న సబితారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 19 : పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థికంగా ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన పలువురుకి సీఎం సహాయనిధి చెక్కులను ఆమె తన కార్యాలయలో అందజేశారు. సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బీఆర్ఎస్ తక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు జెల్లల లక్ష్మయ్య, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్ రెడ్డి

ఆదిభట్ల, సెప్టెంబరు 19: మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటి పరిధిలోని కొంగరకలాన్ 8వ వార్డులో కౌన్సిలర్ గోపగళ్ల మహేందర్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణలతో కలిసి గురువారం మున్సిపల్ జనరల్ నిధులు రూ.6లక్షల విలువైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ వార్డులో ప్రజాసమస్యలు గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో దశల వారీగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. సమస్యలు లేని, రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. నాయకులు రవిందర్ ముదిరాజ్, విష్ణుగౌడ్, భిక్షపతి గౌడ్, శ్రీకాంత్, నరహరి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అక్రమ కేసుల వల్లే కోర్టు చుట్టూ తిరుగుతున్నాం



సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 19: గత ప్రభుత్వం తమపై అక్రమ కేసులు బనాయించడం వల్లే కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన వికారాబాద్ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. సమస్యలపై ఉద్యమిస్తే కలెక్టరేట్ ముట్టడి, ఆర్టీసీ ధర్నా తదితర కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. తమపై కేసులు ఎత్తివేయాలని తాము త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, విన్నవిస్తామని తెలిపారు.

వివాదాస్పద భూముల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ, ఫారెస్టు అధికారులు

మర్పల్లి, సెప్టెంబరు 19: కొన్నేళ్లుగా కల్కొడ, దామస్తపూర్‌లో కొందరు రైతుల భూములు ఫారెస్టు భూములు అని వ్యవసాయం చేయనివ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం తహసీల్దార్ మునిరుద్దీన్, ఫారెస్టు సెక్షన్ అధికారి కిషన్‌నాయక్ సర్వే నంబర్లు 199, 200లలో భూములను పరిశీలించారు. వంద మంది రైతులు 120ఎకరాల్లో సాగు చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా ఫారెస్టు అధికారులు అటవీ భూమి అని హద్దు రాళ్లు పాతి వ్యవసాయం చేయనివ్వడం లేదని రైతులు ఫిర్యాదు చేయగా అధికారులు పరిశీలించారు. త్వరలోనే సర్వే చేసి వివాదాన్ని పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

శామీర్‌పేటను మున్సిపాలిటీ చేయడం లేదు

కాంగ్రెస్ 'ఎ' బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

శామీర్‌పేట, సెప్టెంబరు 19: మండలంలో ఈ సారి కూడా పంచాయతీ ఎన్నికలే జరుగుతాయని, ప్రత్యేక మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంలేదని తనకు ప్రభుత్వం నుంచి సమాచారం ఉందని తుర్కపల్లికి చెందిన కాంగ్రెస్ మేడ్చల్ 'ఎ' బ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం శామీర్‌పేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శామీర్‌పేట పురపాలక సంఘంగా మారడం లేదన్నారు. మండలంలో ఏడు పంచాయతీలుంటాయన్నారు. అన్ని పంచాయతీలతో పాటే వీటికీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందుకు ఓటర్ల జాబితా కూడా సిద్ధం అవుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలిస్తే తాను కాంగ్రెస్ నుంచి జడ్పీటీసీగా పోటీచేస్తానని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

రుణమాఫీ చేయాలని రైతుల ఆందోళన



ప్రజాభవన్ వద్ద రైతుల నిరసన

నవాబుపేట, సెప్టెంబరు 19: మండలంలోని నారేగూడకు చెందిన 200మంది వరకు రైతులు రుణమాఫీ కోసం ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద రైతు ధర్నాలో వారు పాల్గొన్నారు. ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వం కొందరికే రుణమాఫీ చేసిందన్నారు. సమస్యపై డిప్యూటీ సీఎంను కలిసేందుకు వెళ్దామంటే పోలీసులు అరెస్టు చేశారని వాపోయారు.

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న కేఎల్లార్

మహేశ్వరం, సెప్టెంబరు 19 : తెలంగాణ ప్రభుత్వం వచ్చే నెలలో అర్హులైన ప్రతీ ఒక్కరికి కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని, తొందరిపడి ఎవరుకూడా దళారులను నమ్మి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌ఉమారెడ్డి నేతృత్వంలో కేబినెట్ సబ్‌కమిటీ ఆహార భద్రత కార్డుల జారీపై విధివిధానాలను ప్రభుత్వానికి అందించగానే అక్టోబరులో కొత్త రేషన్ కార్డుల జారీ కొరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా, తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో కూడా దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ కసరత్తు చేస్తుందన్నారు. రేషన్ సరుకులపై ఎంత భారమైనా పేదోడికి అండగా ఉండేందుకు ప్రజాపాలన కొనసాగుతుందన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు

చేవెళ్ల, సెప్టెంబరు 19 : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి రైతులకు అధిక ధరలకు ఎరువులు అమ్మితే కేసులు నమోదు చేయిస్తామని చేవెళ్ల ఏడీఏ బి.జె.సురేష్‌బాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలో ఫర్టిలైజర్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. ఎరువులు అధిక ధరలకు అమ్మితే కేసుతో పాటు దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. సమావేశం అనంతరం వ్యాపారులందరూ నూతనంగా బదిలీపై వచ్చిన ఏడీఏ సురేశ్‌బాబును ఘనంగా సన్మానించారు. ఏవో శంకర్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వెలుగుకు సామాజిక గ్రంథాలయాలు దోహదం



అకులమైలారంలో సామాజిక గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కార్లీ విషార్ట్

కందుకూరు, సెప్టెంబరు 19: విద్యా వెలుగుకు సామాజిక గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని, ఆమెజాన్ సంస్థ చొరవతో రంగారెడ్డి జిల్లాలోని 17 మండలాల్లో తొమ్మిది సామాజిక గ్రంథాలయాలు, 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు ఆ సంస్థ వెబ్ సర్వీసెస్ డైరెక్టర్ కార్లీ విషార్ట్ తెలిపారు. గురువారం మండలంలోని ఆకులమైలారంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామాజిక గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించారు. అమెజాన్ సంస్థ వెబ్ సర్వీస్ డైరెక్టర్ పీటర్ శంకర్, మేనేజర్ తాతాజీ, చైతన్య, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ జి.కళమ్మరాజు, మాజీ ఎంపీటీసీ అచ్చన్న పద్మపాండు, సిబ్బంది సురేష్, సుధాకర్, యాదగిరి, సెర్ప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సుంకిరెడ్డికి ఘన సన్మానం



సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ని సన్మానిస్తున్న కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 19: టాస్క్ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని గురువారం కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. హైదారాబాద్‌లోని టాస్క్ కార్యాలయంలో కలిసి సుంకిరెడ్డిని పూలమాలలు, శాలువాలతోస సత్కరించి అభినందించారు. కల్వకుర్తి నియోజకవర్గ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో పెద్దపీట వేయాలని కోరినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌తోనే బడుగు వర్గాల అభివృద్ధి



కాంగ్రెస్‌లో చేరుతున్న గ్రామస్తులు

షాబాద్, సెప్టెంబరు 19 : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం చందన్‌వెల్లిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి.. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల రుణం తీర్చుకున్నాడని అన్నారు. అనంతరం గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నర్సింహారావు, రామస్వామి, రాఘవచారి, వెంకటయ్య, రాంచందర్‌రావు, వెంకటేష్, రమేష్, కిష్టయ్య, పార్టీలో చేరినవారు నర్సింహులు, వెంకటయ్య, చంద్రయ్య, కిష్టయ్య, నర్సింహులు, నారాయణ, హనుమంతు, నర్సింగ్, శ్రీహరి, మల్లేష్, ప్రభాకర్, మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికులు, కర్షకులు కలిసికట్టుగా పోరాడాలి



పోస్టర్ విడుదల చేస్తున్న నర్సింహారెడ్డి

కొందుర్గు, సెప్టెంబరు 19: సమస్యల పరిష్కారం కోసం కార్మికులు, కర్షకులు కలిసికట్టుగా పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 23, 24వ తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించే ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆయన విడుదల చేశారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడిచిపోతున్నా, కార్మికులు, కర్షకుల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. 8 గంటల పని విధానం అమలు కావడం లేదని, రూ.26వేల కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. కౌన్సిల్ సమావేశాలకు కొందుర్గు మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. బి.నర్సింహా, శ్రీను, చెన్నయ్య, యాదమ్మ, జంగయ్య, యామిని, అంజలి, సత్యమ్మ, షరీఫ్, యాదయ్య, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

మర్పల్లి/వికారాబాద్/మోమిన్‌పేట్ / కొడంగల్, సెప్టెంబరు 19: చదువులో వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం మర్పల్లి మండల కేంద్రంలో ఆంగ్ల భాష పట్ల నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆమె తనిఖీ చేశారు. రాబోయే రోజుల్లో 1 నుంచి విద్యార్థులకు ఆంగ్ల భాషను నేర్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం ఆమె ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రాథమికపాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో కాస్త వెనకబడి ఉన్నారని వారి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు ఏ విధంగా ఎలా బోధిస్తున్నారని, పాఠ్యపుస్తకాలపై సందేహాలు ఉంటే ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

మెరిట్ లిస్టు ఆధారంగా ఖాళీల భర్తీ

వికారాబాద్ జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాల్లోని స్పెషల్ ఆఫీసర్ పీజీసీఆర్టీ, సీఆర్టీటీ, పీఈటీలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలోని స్పెషల్ ఆఫీసర్ సీఆర్టీల ఖాళీల భర్తీకి ఆన్‌లైన్‌ద్వారా పరీక్ష నిర్వహించడం జరిగిందని డీఈవో రేణుకాదేవి తెలిపారు. తద్వారా మెరిట్ లిస్ట్ ఆధారంగా ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్ 14, 17 క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం, ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. కాగా, కొడంగల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో రాంరెడ్డి మండల స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు ప్రారంభించారు. క్రీడా పోటీల్లో కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంఈవో గోపాల్, రామమస్తాన్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, పీఈటీలు వసంతకుమార్, శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమను పరిరక్షించండి : బక్కని

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 19: పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షిస్తూ, అన్నదాతకు ఆదాయాన్నిచ్చే పట్టు పరిశ్రమను పరిరక్షించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడలోని పట్టుపరిశ్రమ శాఖ ఏడీ కార్యాలయాన్ని గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులచే మల్బరీని సాగుచేయించి, వారు ఆర్థికంగా అభివృద్ధి చేయాలని 1980లో లింగారెడ్డిగూడ వద్ద పట్టుపరిశ్రమ ఏడీ కార్యాలయాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రభుత్వ భూమిలో భవనాలను నిర్మించి, మల్బరీని సాగుచేస్తూ, పట్టుపురుగుల పెంపకాన్ని చేపట్టి, రైతులకు శిక్షణ ఇస్తూ వచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టుపరిశ్రమను ఉద్యానవన శాఖలో విలీనం చేసి, నిర్వీర్యం చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. విలీనం తరువాత ఏడీ కార్యాలయ నిర్వహణ అధ్వాన్నంగా మారడంతో భవనాలు శిథిలావస్థకు చేరాయని, రైతులు కూడా పట్టు పురుగుల పెంపకంపై ఆసక్తిని కోల్పోతున్నారని అన్నారు. పట్టుపరిశ్రమను పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని బక్కని తెలిపారు.



పట్టు పరిశ్రమ భవనాలను పరిశీలిస్తున్న బక్కని నర్సింహులు

ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



లింగ్యానాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు

వికారాబాద్, సెప్టెంబరు 19 : రాజీవ్ ఆరోగ్య శ్రీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు అన్నారు. గురువారం ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. జీవో 60 ప్రకారం కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలని కోరారు. టీఏ, డీఏలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నర్సిములు, ప్రభాకర్, బుచ్చయ్య, శ్రీనివాస్, అరుంధతి, జయశ్రీ, శైలజ, నరసింహులు, శంకరప్ప, మహేశ్‌కుమార్, మహిపాల్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు మాధవరెడ్డి వర్ధంతి



మాధవరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు

మేడ్చల్ టౌన్ సెప్టెంబరు 19 : స్వాతంత్ర్య సమరయోధుడు సింగిరెడ్డి మాధవరెడ్డి 15వ వర్ధంతిని గురువారం ఆయన స్వగ్రామం గౌడవెల్లిలో నిర్వహించారు. ఐదు రోడ్ల చౌరస్తా వద్ద మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. తెలంగాణకు, గ్రామానికి మాధవరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాయకురాలు సునీతారెడ్డి, పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు తోటకూర వజ్రేష్‌యాదవ్, రమేష్, పరమేశ్వర్‌రెడ్డి, భూపతిరెడ్డి, సత్యం శ్రీరంగం, పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్, కొలను శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్, మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రమణారెడ్డి, రవి తదితరులు నివాళులు అర్పించారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి



బ్యాంకు వద్ద రిలే దీక్షలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 19: షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మూడు రోజులుగా బొంరాస్‌పేట్ ఎస్బీఐ వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. గురువారం దీక్షలోని ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఎలాంటి నిబంధనలు లేకుండా రైతులకు 2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. బ్యాంకులో సిబ్బంది సంఖ్యను పెంచి ప్రజల ఇబ్బందులను తొలగిచాలని డిమాండ్ చేశారు. చివరకు బ్యాంకు మేనేజర్ హామీతో దీక్ష విరమించారు. నాయకులు చంద్రయ్య, సూర్యనాయక్, సుభాష్, బాలు, బలరాం, రైతులు వెంకటయ్య, పద్మమ్మ, బసయ్య, సాయప్ప, ఊశప్ప, పకరప్ప, భీమప్ప, బోనప్ప, బాలయ్య, అనంతమ్మ పాల్గొన్నారు.

అక్రమంగా వేసిన డబ్బాల తొలగింపు



బంట్వారం(కోట్‌పల్లి), సెప్టెంబరు 19: కోట్‌పల్లిలో రోడ్లపై నిర్మించిన డబ్బాలను ఎంపీడీఓ దానియల్ తొలగింప జేశారు. గురువారం పోలీసు ప్రొటెక్షన్ మధ్య దారూర్ సీఐ భీమ్‌కుమార్, కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి, పోలీసు సిబ్బంది సహకారంతో ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు పక్కన అక్రమంగా వేసిన డబ్బాలను తొలగించారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

వికారాబాద్, సెప్టెంబరు 19 : ఈ నెల 28న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. రాజీ పడదగిన కేసులకు ఇది చక్కటి అవకాశమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సెక్రటరీ, న్యాయాధికారి డీబీ.శీతల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీకాంత్, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి శృతిదూత, ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, కరుణసాగర్‌రెడ్డి, కె.బాలకృష్ణరెడ్డి, సీఐ నాగరాజు, భీమ్‌కుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సున్నం శ్రీనివాస్‌రెడ్డి

అన్నదమ్ముల మధ్య గొడవ.. విడిపించేందుకు వెళ్లిన తల్లి మృతి



మృతి చెందిన శంకరమ్మ

పరిగి,సెప్టెంబరు 19: అన్నదమ్ముల గొడవలో విడిపించడానికి వెళ్లిన తల్లిని తోసేయడంతో కిందపడి మృతి చెందింది. వికారాబాద్ జిల్లా, పరిగి మండలం సయ్యద్‌మల్కాపూర్ గ్రామానికి చెందిన చెంచు శంకరమ్మకు ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు నజీరాబాద్‌తండా నివసిస్తుండగా, శంకరమ్మ, చిన్నకొడుకు శ్రీనివాస్ సయ్యద్‌మల్కాపూర్‌లో ఉంటున్నారు. శ్రీనివాస్ ఆరోగ్యం బాగా లేకపోవడంతో చూడడానికి అన్న వెంకటయ్య, వదిన లక్ష్మీ, అక్క సత్తమ్మలు బుధవారం సయ్యద్‌మల్కాపూర్‌కు వచ్చారు. రాత్రి అందరూ కలిసి మద్యం సేవించారు. అనంతరం వెంకటయ్య, డబ్బుల విషయంలో అక్క సత్తమ్మతో గొడవపడ్డారు. నన్ను చూడడానికి వచ్చిన అక్కతో ఎందుకు గొడవ పడుతున్నావని శ్రీనివాస్, అన్న వెంకటయ్యల మధ్య గొడవ ప్రారంభమైంది. ఇద్దరు అన్నదమ్ములు కొట్లాడుతుండగా తల్లి శంకరమ్మ వెళ్లి ఎందుకు కొట్లాడతారని నిలదీసింది. కోపంతో శ్రీనివాస్ తల్లిని తోసేశాడు. పక్కనే ఉన్న సీసీ రోడ్డుపై పడడంతో బలంగా తలకు గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో పరిగి అస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి పెద్ద కొడుకు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్, సీఐ శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ విజయకుమారి

శామీర్‌పేట, సెప్టెంబరు 19: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బాధ్యతగా అత్యుత్తమ నాణ్యమైన విద్యను బోధించాలని జిల్లా విద్యాధికారి(డీఈఓ) విజయకుమారి సూచించారు. గురువారం శామీర్‌పేటలోని జడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం వేణు ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. డీఈవో హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్ది ఉత్తమ ర్యాంకులు సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధి 12 పాఠశాలల 24మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెరపైకి భూ వ్యవహారం

- భూమిని పరిరక్షించుకుందామంటూ విద్యా వికాస్ సమితి కరపత్రాలు
- రూ.200కోట్ల భూమి అన్యాక్రాంతమవుతోందని ప్రచారం

తాండూరు, సెప్టెంబరు 19 : తాండూరులోని చించోళి రోడ్డులో కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. పీపుల్స్ డిగ్రీ కళాశాలకు చెందిన ఈ భూమి ఏళ్లుగా కబ్జాదారుల చెరలో ఉంది. సబ్‌రిజిస్ట్రార్లు సైతం భూములను ప్లాట్లలో రిజిస్ట్రేషన్ చేశారు. రూ.200కోట్లకుపైగా విలువైన ఈ 27ఎకరాల 19గుంటల భూమి విషయం తాండూరులో హాట్ టాపిక్‌గా మారింది. మాజీ మంత్రి మాణిక్‌రావు వర్ధంతి రోజు ఆర్పీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి ఈ భూమిని రక్షించుకుందామని పిలుపివ్వడంతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకొచ్చింది. మాజీ మంత్రి ఎం.చంద్రశేఖర్ తనయుడు ఎం.రాకేష్ కూడా దీనికి కౌంటరిచ్చారు. ఈ భూమిని గత ప్రభుత్వంలో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారికి విక్రయించారు. పీపుల్స్ డిగ్రీ కళాశాల పేరిట ఉన్న ఈ భూమిని అన్యాక్రాంతం కాకుండా రక్షించాలని విద్యా వికాస్ సమితి ఆధ్వర్యంలో ప్రతినిధులు కొందరు.. 'ప్రజలరా మేల్కొందాం. భూ బకాసురుల చెర నుంచి విద్యా వికాస్ సమితి ట్రస్ట్ ఆస్తిని కాపాడుకుందాం.' అని కరపత్రాన్ని తయారు చేశారు. సమితి సభ్యులు సత్యనారాయణ బూబ్, నాగారం నర్సిములు, పటేల్ శ్రీశైలం, రాంరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డిల పేరిట కరపత్రాన్ని పంపిణీ చేస్తున్నారు. ఈ అంశంపై ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

భూమి పూర్వపరాల్లోకి వెళ్తే

దివంగత మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సూచనలతో 1966లో విద్యా సంస్థల ఏర్పాటుకు విరాళాలు సేకరించి తాండూరు పాలిటెక్నిక్ కళాశాల కమిటీని రిజిస్ట్రేషన్ చేశారు. 1973లో దానికి విద్యావికాస్ సమితిగా మార్చారు. ఇప్పటికీ ఈ స్థలంలో పీపుల్స్ డిగ్రీ కళాశాల వ్యవహారాలు కొనసాగుతున్నాయి. 1972లో పీపుల్స్ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి మాణిక్‌రావు ఫౌండర్ చైర్మన్‌గా పనిచేశారు. అప్పట్లో గంజ్ అసోసియేషన్ వ్యాపారులు, రైతులు, టాపర్స్ సంఘం భూసేకరణకు తలాకొంత సాయం అందించారు. రూ.200కోట్ల విలువైన 27ఎకరాల 19గుంటల ఈ స్థలం దక్కన్ పార్కిలిన్ ఫ్యాక్టరీది. వివిధ కారణాలతో కోర్టు ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని మాణిక్‌రావు అప్పట్లో కొనేందుకు హైకోర్టు ద్వారా ప్రయత్నించారు. సొసైటీగా ఏర్పడితే ఈ స్థలాన్ని ఇస్తామని హైకోర్టు చెప్పింది. విద్యా వికాస్ సమితి పేరిట ఈ స్థలాన్ని సేల్‌డీడ్ చేసుకున్నారు. భూమి కొనుగోలుకు మాణిక్‌రావుకు అప్పట్లో వ్యాపారులు కూడా సహకరించారు.



విద్యా వికాస్ సమితి పేరిట పంపిణీ చేస్తున్న కరపత్రాలు

అసెంబ్లీలో చర్చ.. హౌస్ కమిటీ ఏర్పాటు

అప్పట్లో ఈ ఆస్తిని కాపాడాలని వ్యాపారులు, నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి ఏపీ అసెంబ్లీలో ఈ ఆస్తులపై చర్చ జరిగింది. 1997లో షాద్‌నగర్ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేతృతంలో సభాసంఘాన్ని వేశారు. ఈ భూమిని ప్లాట్లుగా అమ్మడాన్ని సభాసంఘం కూడా తప్పు పట్టింది. ఇప్పుడు ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



మానవహారంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, విద్యార్థులు

శంకర్‌పల్లి, సెప్టెంబరు 19: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శంకర్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో గురువారం స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ, మానవహారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, కౌన్సిలర్ చంద్రమౌళి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ అనంతయ్య, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

తూంకుంటను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



శామీర్‌పేట, సెప్టెంబరు 19: తూంకుంట మున్సిపాలిటీలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని విజయవంతగా నిర్వహించి క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అని కమిషనర్ వెంకటగోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక అన్నారు. గురువారం 1వ వార్డు ఎస్టలైవ్ గార్డెన్‌లోని కాలనీలో, ప్రధాన చౌరస్తా వద్ద సిబ్బంది చెత్తను తొలగించారు. డ్రైనేల్లలో పూడికను తొలగించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ కన్నేశ్వర్‌రావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి



కందుకూరు : నాయకులతో మాట్లాడుతున్న ఎండీవో సరిత, పాల్గొన్న తహసీల్దార్ గోపాల్

- మండల అధికారులు
- రాజకీయ నాయకులతో

ఓటరు ముసాయిదాపై ప్రత్యేక సమావేశాలు

కడ్తాల్, సెప్టెంబరు 19: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో వార్డుల ప్రకారం ఓటర్ లిస్టులను సరిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి లు అధికారులను కోరారు. కడ్తాల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితా అభ్యంతరాలపై రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ ముంతాజ్‌లు సమావేశం నిర్వహించారు.

ఆమనగల్లు : మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఓటరు ముసాయిదా జాబితాలపై రాజకీయ పార్టీల నేతలతో ఎంపీడీవో కుసుమ మాధురి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ లలిత, ఎంపీవోలు పాల్గొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు ఓటర్ల జాబితాలలో మార్పులు, చేర్పులపై సూచనలు చేశారు. ఎంపీడీవో మాధురి కి వినతి పత్రం అందజేశారు.

యాచారం : వివిధ గ్రామాల్లో ఏడాది క్రితం మరణించిన వారి పేర్లు, వివాహాలు చేసుకున్న వారి పేర్లు ఓటర్ లిస్టు నుంచి తొలగించలేదని, వారి పేర్లతో ఓటు వేసే ప్రమాదముందని, పేర్లను ఎందుకు తొలగించలేదని, గ్రామాలు, నగరంలో కూడా ఓటర్‌లిస్టుల్లో ఉన్న వారి పేర్లను తక్షణమే తొలగించాలని రాజకీయ నాయకులు డిమాండ్ చేశారు. యాచారం మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పక్షాల సమావేశం జరిగింది. ఎంపీడీవో నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మరణించిన, వివాహం చేసుకున్న వారి పేర్లు తక్షణమే తొలగించాలని కోరారు. సీపీఎం నాయకులు ఆలంపల్లి నర్సింహ, పి.అంజయ్య, చందూనాయక్, బీఆర్ఎస్ నాయకులు కె.రమేష్‌గౌడ్, ఖాజుద్దీన్‌లు పలు సమస్యలపైప ఎంపీడీవోకు వినతి పత్రమందించారు. బీజేపీ మండలాధ్యక్షుడు తాండ్ర రవీందర్, ప్రధాన కార్యదర్శి నడికూడి కృష్ణ, సీపీఐ మండల నాయకులు ఎంపీవో శ్రీలత, పంచాయతీ రాజ్ శాఖ డీఈ శ్రీనివాస్ తదితరులున్నారు.

నందిగామ : నందిగామ ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు సవరణపై ఎంపీడీవో సుమతి అధ్యక్షతన అకిలపక్షం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు లిస్టులో మార్పులు చేర్పులపై అధికారులు అకిలపక్షం నాయకుల అభిప్రాయాలు తీసుకున్నారు. తహసీల్దార్ రాజేశ్వర్, నాయకులు జంగ నర్సింలు, అంజనేయులు, చెన్నయ్య, తుమ్మల నర్సింలు, కొంగరి



యాచారం : ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

నర్సింలు, సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : ఓటర్‌లిస్టులో తప్పు ఒప్పులు ఉంటే సరిచేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సుమతి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డిలు కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు కృష్ణ, రమేష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : ఓటరు లిస్టులో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 వరకు ఫిర్యాదు చేయవచ్చని ఎంపీడీవో రవి చంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేశంపేట మండలంలో బోగస్ ఓట్లు నమోదవుతున్నాయని బీజేపీ మండలాధ్యక్షుడు రాములు గౌడ్ తెలిపారు. తహసీల్దార్ విచారణ చేపడితే తొలగించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంపీవో కిష్టయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, యెన్నం శ్రీధర్ రెడ్డి, ఇప్పలపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల నాయకులందరు సహకారం అందించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఓటర్ల జాబితా రూపకల్పనపై నాయకులతో సమావేశమయ్యారు. తహసీల్దార్ జగదీశ్వర్, డీటీ భాస్కర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, వెంకట్‌నర్సింహా రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కురుమయ్య, మాజీ సర్పంచ్ భూపాలచారి, నర్సింగ్‌రావు, పాల్గొన్నారు.

కందుకూరు : ఓటర్ లిస్టుల్లో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా 20, 21 తేదీల్లో ఫిర్యాదుల చేయాలని ఎండీవో సరిత, తహసీల్దార్ కె.గోపాల్‌లు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఎంపీవో గీత, మాజీ ఎంపీపీ అశోక్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ ఎస్.ఎల్లారెడ్డి, నాయకులు బొక్క సంజీవరెడ్డి, సౌడపు శేఖర్‌గౌడ్, సామ పాండురంగారెడ్డి, ఎండి ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : ప్రతీ ఒక్కరు ఓటరు లిస్టును సరిచేసుకోవాలని ఎంపీడీవో అపర్ణ అన్నారు. మండలంలోని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్లకు అభ్యంతరాలు ఉంటే ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. డీటీ మధు, ఎంపీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, బీజేపీ మండలాధ్యక్షుడు కిరణ్, సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హిమాయత్‌సాగర్‌లో
గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 19 : హిమాయత్‌సాగర్ చెరువులో గుర్తుతెలియని శవం లభ్యమైన ఘటన గురువారం ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాంచంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కోత్వాల్‌గూడ పరిధిలో గుర్తుతెలియని (30) వ్యక్తి హిమాయత్‌సాగర్ చెరువులో పడి మృతి చెందినట్లు జాలర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని బయటకు తీసి పరిసరాలను పరిశీలించారు. ఈత కోసం వెళ్లి మృతి చెందాడా? లేక ఎవరైన హత్య చేసి చెరువులో పడేశారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మృతుడి ఒంటిపై నల్లని ప్యాంట్, నల్లని షర్ట్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరికైన ఆచూకీ తెలిస్తే ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

యాచారం, సెప్టెంబరు 19 : యాచారం పెట్రో మొబైల్ పోలీసులు గురువారం ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. గున్‌గల్ నుంచి యాచారం మండల కేంద్రం వస్తున్న మారుతి వ్యాన్‌ను తనిఖీ చేయడంతో బియ్యం పట్టుబడ్డాయి. కడ్తాల్ మండలంలోని పల్లెచెల్కతండాకు చెందిన రమేష్ రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది



కడ్తాల : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గూడూరు శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్/ఆమనగల్లు/యాచారం/కేశంపేట/ కందుకూరు, సెప్టెంబరు 19: అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని స్కై బ్లూ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద గురువారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహ రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని గుర్రం గుట్ట కాలనీలో యువసేన యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశ్ మండపం వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. చెదురుపల్లి సురేందర్‌గౌడ్ రూ.50,001 లకు లడ్డూను, ధనలక్ష్మీ మాలను వడ్డె శివ రూ.17,001 లకు, పూసల సైదులు ఆపీల్ రూ.9 వేలకు కైవసం చేసుకున్నారు. యాచారం మండలం నందివనపర్తిలో గణేష్ లడ్డూను వంగూరు యాదయ్య రూ.90,116లకు చిన్నలడ్డూ పంతం మల్లయ్యయాదవ్ రూ.42,116లకు దక్కించుకున్నారు. కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ 4వ వార్డు యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయకుని మండపం వద్ద అన్న ప్రసాద వితరణ చేపట్టారు. అంతకుముందు మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ అబ్బి సుందరయ్యలు పూజలు నిర్వహించారు. కందుకూరు మండలంలోని సరస్వతిగూడలో గురువారం గణేష్ నిమజ్జనం చేశారు. శ్రీరామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో లడ్డూన అదే గ్రామానికి చెందిన కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి రూ.54వేలకు దక్కించుకున్నాడు. మాజీ సర్పంచ్ బి.రాము, యాదయ్య, భాస్కర్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల అరెస్ట్

- చలో ప్రజాభవన్ పిలుపు నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు.. ఠాణాకు తరలింపు



ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి : పోలీసుల అదుపులో భారత్ రాష్ట్ర సమితి నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/కొత్తూర్/కొందుర్గు/చౌదరిగూడ, సెప్టెంబరు 19: ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీచేసి మాట నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ చలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. రైతులు, బీఆర్ఎస్ నాయకులు ఎవరు కూడా హైదరాబాద్ తరలకుండా నిఘా ఏర్పాటు చేశారు. గురువారం తెల్లవారుజాము నుంచే నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమనగల్లు మండలంలో పత్యనాయక్, దోనాదుల కుమార్, శ్రీనునాయక్, సయ్యద్ ఖలీల్, పంతూనాయక్, రమేశ్ నాయక్‌లను, కడ్తాలలో మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు జోగు వీరయ్య, పంతూనాయక్, రమేశ్ నాయక్‌లను, తలకొండపల్లి మండలంలో శంకర్, జ్యోతయ్య, కృష్ణ లను పోలీలు అరెస్ట్‌చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీఐలు ప్రమోద్ కుమార్, శివప్రసాద్, ఎస్ఐలు వెంకటేశ్, వరప్రసాద్, శ్రీకాంత్‌లు తెలిపారు. ఈమేరకు దశరథ్ నాయక్, జీఎల్ఎన్‌రెడ్డి, పత్యానాయక్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అన్నదాతలపై నిర్బంధమెందుకని ప్రశ్నించారు. రైతుల సంఘటిత శక్తి ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తలదించక తప్పదన్నారు. అదేవిధంగా కొత్తూర్ పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. సీనియర్ నాయకుడు బి.దేవేందర్‌యాదవ్, మెండె కృష్ణ, మాదారం నర్సింహగౌడ్, సోమ్లానాయక్, చింతకింది రాజేందర్‌గౌడ్, రవినాయక్, విష్ణు తదితరులు అరెస్ట్ చేసిన వారిలో ఉన్నారు. అలాగే కొందుర్గు మండల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డితో పాటు మరో ఐదుగురిని అరెస్ట్ చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. హామీలను అమలు పర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ అన్నారు. ప్రజాభవన్ ముట్టడికి వెళ్తున్నారనే సమాచారంతో జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు ముందస్తుగా నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బాబురావు, వెంకటేష్, గణేష్, శేఖర్, జబ్బార్, కొండి యాదయ్య, శివరాజ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



కొందుర్గు : అరెస్టైన బీఆర్ఎస్ నాయకులు



కొత్తూర్ : నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

ఘనంగా మిలాద్-ఉన్-నబీ



కొత్తూర్ : ఇన్ముల్‌నర్వ నుంచి జేపీ దర్గాకు ర్యాలీగా తరలిన మైనార్టీలు

ఆమనగల్లు/కొత్తూర్/శంషాబాద్/తలకొండపల్లి, సెప్టెంబరు 19: మిలాద్-ఉన్- నబీ వేడుకలు గురువారం ఆమనగల్లు పట్టణంలో ముస్లిం మైనార్టీలు అట్టహాసంగా జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకొని నిర్వహించిన వేడుకలకు పట్టణంలోని జామా మసీద్, మహ్మదీయ మసీద్, హైమద్ ఇలాల్ మసీద్‌లను శోభాయామానంగా అలంకరించారు. ప్రార్థనల్లో ముస్లిం మైనార్టీలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మసీద్ కమిటీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జామియా మసీద్ వద్ద ర్యాలీని మసీద్ కమిటీ అధ్యక్షుడు మాసూమ్, ఎస్ఐ వెంకటేశ్‌లతో కలిసి సీఐ ప్రమోద్ కుమార్ ప్రారంభించారు. ప్రధాన వీధుల మీదుగా మక్కా నమూనా సెట్‌తో ర్యాలీ కొనసాగింది. అనంతరం మసీద్ వద్ద కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మసీద్, అధ్యక్షులు ఎం.డీ మాసూమ్, ఖాదర్‌ఖాద్రీ, గౌస్‌మైనోద్దీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. మహ్మద్ ప్రవక్త చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని మజీద్ ఇమామ్ మౌలానా ఇంతియాజ్ ఖాద్రి అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో నిర్వహించిన ర్యాలీని ఖాద్రి ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్ రహెమాన్, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, నాయకులు ఆరిఫ్, అబ్బాస్, జహీరోద్దీన్, కరీం, మౌలానా ఇర్ఫాన్, రశీద్, మన్నాన్,సమ్మద్, యూసుఫ్, రహీమ్, అక్బర్, జాఫర్, గౌస్, తదితరులున్నారు. ఉత్సవాలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఖాజాపాషా ఆధ్వర్యంలో మైనార్టీలు కొత్తూర్ మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఇన్ముల్‌నర్వ నుంచి జేపీ దర్గా వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ట్రాలీ వాహనాన్ని ఏర్పాటుచేసి చాదర్‌లు, పూజా సామగ్రి ఉంచి యువకులు మేళతాళాలతో నృత్యాలు చేస్తూ దర్గాకు చేరుకున్నారు. దర్గాకు అప్పగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, కొత్తూర్, నందిగామ ఇన్‌స్పెక్టర్లు నర్సింహరావు, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మైనారిటీలు జహీరుద్దీన్, సాధక్, శౌకత్, ఖదీర్, జాబర్‌ఖాన్, రఫీ, సిరాజ్, సయ్యద్‌రియాజ్, యూసుఫ్, అబెద్‌అన్సారీ, హర్షద్, పాషా తదితరులు పాల్గొన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ముస్లింలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు, కోత్వాల్‌గూడచౌరస్తా, మహవీర్‌బిల్డర్స్ గుండా కొనసాగింది. బైక్‌ర్యాలీ నిర్వహించడంతో హైదరాబాద్ వైపు నుంచి షాద్‌నగర్ వైపుకు వెళ్లే మార్గంలో కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



తలకొండపల్లి : ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు



శంషాబాద్ : ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

బాధితుడికి ఎల్వోసీ అందజేత



ఎల్వోసీని అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, సెప్టెంబరు 19: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడి కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురువారం క్యాంపు కార్యాలయంలో ఎల్వోసీ అందజేశారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్లకు చెందిన యాదగిరి కొన్నిరోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యానికి సరిపడ డబ్బులు లేకపోవడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.25లక్షల ఎల్వోసీని ఎమ్మెల్యే అందించారు.

విద్యుత్ లైన్ నిర్మాణం చేపట్టొద్దు

- కలెక్టర్ శశాంకకు పోమాల్‌పల్లి గ్రామస్తుల వినతి

కేశంపేట, సెప్టెంబరు 19: మహేశ్వరం నుంచి కర్ణాటకలోని బీదర్ వరకు వేస్తున్న 765 కేవీఏ హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను తమ గ్రామం మీదుగా వేయొద్దని పోమాల్‌పల్లి గ్రామస్తులు గురువారం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందించారు. విద్యుత్ లైన్ మొదట పోమాల్‌పల్లి పెద్దగుట్ట పక్క నుంచి మార్కింగ్ ఇచ్చారని, ప్రస్తుతం గ్రామ సమీపం నుంచి నూతనంగా మార్కింగ్ ఇచ్చి టవర్ల నిర్మాణానికి ముగ్గుపోస్తున్నారని తెలిపారు. గ్రామానికి మూడు వైపులా చెరువులు ఉన్నాయని, ఒక వైపు మాత్రమే గ్రామ అవసరాల కోసం స్థలం ఉందని, విద్యుత్ లైన్ వేయొద్దని కోరారు. మొదట మార్కింగ్ ఇచ్చిన ప్రాంతం నుంచి వేస్తే ఎవరికి ఎలాంటి అభ్యంతరాలు ఉండవని తెలిపారు. అలాగే పవర్ గ్రిడ్ బీదర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ షాద్‌నగర్ ఏరియా అధికారిని కలిసి వినతిపత్రం అందించారు. మాజీ సర్పంచ్ కృష్ణయ్య, ఉపసర్పంచ్ రమేష్, బుర్రి భూపాల్‌రెడ్డి, పూజారి రవి శర్మ, అంజయ్య, మూత్యాల్ రెడ్డి, మస్తాన్, నర్సింలు, అంజయ్య, నిలకంఠ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలను పరిష్కరించండి

కొందుర్గు, సెప్టెంబరు 19: గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.శివారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళా టీచర్లకు రాత్రి 9గంటల వరకు పనిచేయించడం హేయమైన చర్య అన్నారు. టీఎస్‌యూటీ ఎఫ్ మండలాధ్యక్షుడు బి.ప్రేమ్‌కుమార్, టీచర్లు గంగాధర్, మల్లేష్, అంజనేయులు, సంజీవ్, తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

యాచారం : మండల పీఆర్‌టీయు టీఎస్ ఉపాధ్యాయ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ తెలిపారు. అధ్యక్షుడిగా బి.తిరుమలేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ యాదగిరి, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.హరిప్రసాద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా జి.జయమ్మ, కార్యదర్శిగా జె.శ్రవణ్, మహిళా కార్యదర్శిగా జె.సాధన ఇతర సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కందుకూరు : కందుకూరు ఉన్నత పాఠశాలలో 2007-2008 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన గీతను ఆగపల్లికి చెందిన రాజేష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఆమె భర్త జూన్ 27న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తోటి విద్యార్థులు రూ.43,500 పోగుచేసి గీతకు అందజేశారు.

చేవెళ్ల : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని వివేకానంద ఇంటర్నేషనల్ పాఠశాల చైర్మన్ కొరదాల నరేష్ తెలిపారు. ఇటీవల పాఠశాల విద్యార్థులు నగరంలోని ఈసీఐఎల్‌లో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంపికై కూకట్‌పల్లిలో స్టేట్ లెవెల్‌లో జరిగిన టోర్నీలో పాల్గొని మూడవ స్థానంలో నిలిచారు. ఈమేరకు వారిని పాఠశాలలో అభినందించారు.

ఆమనగల్లు : మాజీ మంత్రి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే చర్లకోలు లక్ష్మారెడ్డిని గురువారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ పరామర్శించారు. కాగా, ఇటీవల లక్ష్మారెడ్డి సతీమణి మృతి చెందింది. మహబూబ్ నగర్ జిల్లా ఆవంచలో శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద జైపాల్‌యాదవ్ నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్ రావు, నాయకులు భాస్కర్ రావు, తదితరులు ఉన్నారు.

తలకొండపల్లి : సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, కాంగ్రెస్ తలకొండపల్లి మండల మాజీ అధ్యక్షుడు గుజ్జల మహేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వపరంగా సహకరించాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించినట్లు మహేశ్ తెలిపారు.

చౌదరిగూడ : మండల పరిధిలోని పద్మారం కార్యదర్శిగా విధులు నిర్వహించి ఇటీవల లైబ్రేరియన్‌గా ఉద్యోగం పొందిన ధీరజ్‌ను మాజీ సర్పంచ్ లక్ష్మీసుధ, ఎంపీటీసీ రాములు సన్మానించారు. అలాగే నూతన పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన షఫీని వారు సన్మానించారు.

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ పట్టణ శివారులోని ఎఫ్‌సీఎన్ వృద్ధాశ్రమంలో అనిల్ అనే అభాగ్యుడి వైద్యం కోసం ఆర్యవైశ్య సంఘాల నాయకులు సహకారం అందించారు. సంఘం నాయకుడు మలిపెద్ది శ్రీనివాసులు జన్మదినాన్ని వృద్ధాశ్రమంలో నిర్వహించారు. మధుమేహంతో బాధపడుతున్న అనిల్‌కు రూ.10వేల విలువైన మందులను ఇచ్చారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు బెజ్జుగం రమేష్, గందే సురేష్, మాధురి నందకిషోర్, మలిపెద్ది శ్రీనివాసులు, తదితరులున్నారు.

తలకొండపల్లి : పనితీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకి గార్డెన్‌లో గురువారం బదిలీ అయిన ఎంఈవో సర్దార్ నాయక్ వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఎంఈవో బాను నాయక్ అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై సర్దార్ నాయక్‌ను ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం జంప్లానాయక్, రామనాథం, ఝాన్సీరాణి, భాస్కర్, రాందాస్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

మాడ్గుల : మండలంలోని కొల్కులపల్లి ప్రాథపాఠశాలో పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా మహిళాకార్యదర్శిగా శశికళ ఎన్నికయ్యారు. ఎ.రామలింగం, లాలు నాయక్, వెంకట్‌నారాయణరెడ్డి, తదితరులున్నారు.

ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి

చేవెళ్ల, సెప్టెంబరు 19 : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి అని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ టేనావతికి వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. కొత్త ప్రిన్సిపాల్ చిన్నపరెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, సీనియర్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



టేనావతిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

పైకి రాని గంగమ్మ!

(5వ పేజీ తరువాయి)

లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిలో కమ్యూనిటీ సోక్‌పిట్స్ 876 ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ 134 మాత్రమే నిర్మించారు. అలాగే ఇంటింటికీ ఇంకుడు గుంతల్లో భాగంగా 645 ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 167 మాత్రమే నిర్మించారు. పట్టణ ప్రాంతాల్లో నీటి వినియోగం విపరీతంగా పెరిగింది. ఎక్కడ చూసినా రోడ్ల నిర్మాణం.. నీరు ఇంకే మార్గమే లేకుండా పోయింది. జూన్, జూలైలలో వర్షాలు అంతంత మాత్రంగా కురిసినప్పటికీ ఆగస్టు, సెప్టెంబరులో కురువాల్సిన దానికంటే ఎక్కువగా కురిసింది. చెరువులు, కుంటలు నిండినా.. వాగులు, వంకలు పొంగి పొర్లినా పాతాళ గంగ పైకి రాలేదు.

ఆరేళ్లుగా నిలిచిన సబ్సిడీ డ్రిప్

ఇక పంటలు పండించడానికి డ్రిప్ ఇరిగేషన్ వంటి పద్ధతులు పాటించకపోవడంతో అధిక నీటిని బోర్ల ద్వారా పంటల సాగుకు వాడాల్సి వస్తోంది. ప్రభుత్వం బిందు సేద్యంపై సబ్సిడీ ఇవ్వడమే మానేసింది. ఉద్యాన పంటలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. ఆరేళ్లుగా డ్రిప్‌లకు సబ్సిడీ ఇవ్వడం లేదు. దీంతో ఉన్న నీరంతా పంటలకు పారబెట్టడంతో బోరు, బావుల్లో నీటి మట్టాలు మరింతగా తగ్గుతున్నాయి. పంజాబ్, హర్యాణా వంటి రాష్ట్రాల్లో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతినే పాటిస్తున్నారు. దీంతో ఆ రాష్ట్రాల్లో మంచి ఫలితాన్ని ఇస్తోంది. ఇక్కడ కూడా రైతులు సాంకేతికను ఉపయోగించి ముందుకు సాగితే నీటి ఎద్దటిని నివారించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

ఆరు మండలాల్లో ప్రమాద ఘంటికలు..

జిల్లాలోని సరూర్‌నగర్, చౌదరిగూడెం, మంచాల, కొత్తూరు, ఇబ్రహీంపట్నం, షాబాద్ మండలాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. 9మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు వెళ్లాయి. సరూర్‌నగర్‌లో గత ఏడాది, ఈ ఏడాది జూన్‌లో భూగర్భ జలాలను పరిశీలిస్తే -9.68 మీటర్ల లోతులోకి వెళ్లగా, జూలైలో పరిస్థితి భయంకరంగా మారింది. ఏకంగా -12.3 మీటర్ల లోతులోకి వెళ్లాయి. ఆగస్టులో కురిసిన వర్షాలకు కొంత పైకి రావడంతో -9.13 మీటర్ల లోతులో భూగర్భ జలాలు నమోదయ్యాయి. చౌదరిగూడ మండలంలో గత ఏడాది జూన్, ఈ సారి జూన్‌లో నమోదైన భూగర్భ జలాలను పరిశీలిస్తే -2.25 మీటర్లు లోతులో ఉన్నాయి. జూలైలో -5.17 మీటర్ల లోతులోకి చేరాయి. ఆగస్టులలో -9.09 మీటర్ల లోతులోకి వెళ్లాయి. మంచాల మండలంలో గత ఏడాది జూన్ ఈసారి జూన్‌లో నమోదైన భూగర్భ జలాలను పరిశీలిస్తే -5.00 మీటర్ల లోతులోకి వెళ్లాయి. జూలైలో -6.71 మీటర్ల లోతులోకి, ఆగస్టులో -7.89 మీటర్ల లోతులోకి వెళ్లాయి. కొత్తూరు మండలంలో గత ఏడాది జూన్ ఈ ఏడాది జూన్‌లో భూగర్భ జలాలు -4.37 మీటర్ల లోతులో, జూలైలో -5.06 మీటర్లు లోతులో, ఆగస్టు లో 6.88 లోతులోకి భూగర్భ జలాలు వెళ్లిపోయాయి. ఇబ్రహీంపట్నంలో జూన్‌లో -8.64 మీటర్లలోతులో, జూలైలో -5.01 మీటర్ల లోతులో, ఆగస్టులో -6.54 మీటర్ల లోతులోకి నీరు వెళ్లాయి. షాబాద్ మండలంలో జూన్‌లో -2.07 మీటర్ల లోతులో ఉండగా జూలైలో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. --8.28 మీటర్ల లోతులోకి వెళ్లాయి. ఆగస్టులో కొంత పైకి రావడంతో -6.79 మీటర్ల లోతులో ఉన్నట్లు భూగర్భ జలశాఖ అధికారులు గుర్తించారు.

మూడు మండలాల్లో 5మీటర్ల లోతులోకి..

చేవెళ్ల, మొయినాబాద్, శంషాబాద్ మండలాల్లో ఐదు మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు వెళ్లాయి. చేవెళ్ల మండలంలో గత ఏడాది జూన్ ఈ ఏడాది జూన్ మాసాన్ని పరిశీస్తే -1.29 మీటర్ల లోతులోకి వెళ్లగా జూలైలో -0.97 మీటర్ల తోతులోకి వెళ్లగా ఆగస్టులో -5.63 మీటర్ల లోతులోకి వెళ్లాయి. అలాగే మొయినాబాద్ మండలంలో గత ఏడాది జూన్, ఈ సారి జూన్ పరిశీలిస్తే -2.09 మీటర్ల మైనస్‌లో ఉంది. జూలైలో -2.23 మీటర్లు మైనస్‌లో, ఆగస్టులో -5.28 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు వెళ్లాయి. శంషాబాద్ మండలంలో గత ఏడాది ఈ ఏడాది జూన్‌లో -1.24 మీటర్ల లోతులోకి, జూలైలో -3.49 మీటర్ల లోతులోకి, ఆగస్టులో -5.32 మీటర్ల లోతులోకి వెళ్లాయి.

నీటి సంరక్షణ బాధ్యతగా భావించాలి



ప్రతీ ఒక్కరు నీటి సంరక్షణ బాధ్యతగా భావించి నీటిని పొదుపుగా వాడుకోవాలి. ఇంకుడు గుంతల ద్వారా వాన నీటిని ఒడిసి పట్టాలి. భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని భవిష్యత్ అవసరాలకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో నీటి వినియోగం పెరిగింది. పొదుపుగా వాడుకోవాల్సిన నీటిని ఎడాపెడా వాడేస్తున్నారు. నీరు ఇంకేందుకు అర్బన్ ప్రాంతాల్లో అవకాశాలు తక్కువగా ఉండటంతో వర్షపు నీరంతా కాలువల ద్వారా వృథాగా పోతుంది. వర్షపు నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలి.

- మాధవరావు, జిల్లా భూగర్భజల వనరుల శాఖ అధికారి

విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలి

కందుకూరు, సెప్టెంబరు 19: విద్యార్థి దశలో ప్రతీ ఒక్కరు పోషకాహారం తీసుకోవాలని సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. గురువారం కందుకూరు మండలం గూడూరు గేటు వద్ద ఉన్న జ్యోతిరావుపూలే గురుకుల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషకాహారం, పరిశుభ్రతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుతో పాటు ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. సూపర్‌వైజర్లు ఇందిర, సబిత, రాచులూరు వైద్యాధికారి సంధ్య, సిబ్బంది, తదితరులున్నారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

షాద్‌నగర్, సెప్టెంబరు 19: చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్య తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం శేరిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శి యాదయ్య, ఉపాధ్యాయుడు సురేష్, అంగన్‌వాడీ టీచర్ టి.శ్రీమతితో పాటు గర్భిణీలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 19: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్, మోకిల సీఐ వీరబాబులు అన్నారు. మోకిలలోని క్రీడా ప్రాంగణంలో గురువారం స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చెవేళ్ల జోనల్‌స్థాయి అండర్17, అండర్14 (బాలుర, బాలికల) వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు వారు బహుమతులను అందజేశారు. క్రీడల్లో 30కి పైగా పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా బాలుర అండర్17లో మొదటి బహుమతి శంకర్‌పల్లి, ద్వితీయ బహుమతి ప్రొద్దుటూరు పాఠశాల విద్యార్థులు, బాలికల అండర్17 ప్రొద్దుటూరు, ద్వితీయ బహుమతి ఎంజేపీ షాబాద్ విద్యార్థినులు గెలుపొందారు.